


WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY

**పాఠకులకు గమనిక**

దీపావళి పండుగను పురస్కరించుకుని 08–11–26 , పత్రికకు సెలవు. తదుపరి సంచిక 10–11–26 యథావిధిగా వెలువడుతుంది.

యాజమాన్యం

నవంబర్ 8 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 273 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY NOVEMBER 8 2026 | VOL:18 | ISSUE: 273 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

# ప్రజాబలం యాత్రతో ప్రజల్లోకి వెళ్తా: సీఎం రేవంత్‌రెడ్డి

- సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటనలు
- కలిసికట్టుగా ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చు
- కొడంగల్ అభివృద్ధికి రూ.9 వేల కోట్లతో పనులు
- పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడంపై కేసీఆర్‌కు ప్రశ్నలు
- రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి.. నీటిని పొదుపుగా వాడుకోవాలి
- దేశానికే ఆదర్శంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతాం



సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. మనమంతా కలిసికట్టుగా ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో శనివారం నిర్వహించిన రైతుమేళాను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, (మిగతా 2వ పేజీలో..)

## కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

- కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్
- రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ
- ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి (మిగతా 2వ పేజీలో..)



## ఇరాన్‌తో యుద్ధమే లేదు.. ఇజ్రాయెల్‌ను నేనే కాపాడాను: ట్రంప్

- ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదన్న ట్రంప్
- గత ఐదు నెలలుగా ఎవరూ చనిపోలేదని వెల్లడి
- ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌ను తానే కాపాడానని వ్యాఖ్య
- ఇరాన్ అణు కార్యక్రమం శాంతియుతమేనని టెహ్రాన్ స్పష్టీకరణ



ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణను 'యుద్ధం'గా పరిగణించలేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో వాషింగ్టన్ గణనీయమైన పురోగతి సాధించిందని, ఘర్షణకు ముందు కంటే ఇప్పుడే తాము ఎక్కువ చమురును పొందుతున్నామని పేర్కొన్నారు. (మిగతా 2వ పేజీలో..)

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

- ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక దీపావళి
- ఎక్స్ వేదికగా వీడియో సందేశం విడుదల
- సైనికులతో కలిసి పండుగ జరుపుకునే సంప్రదాయం కొనసాగింపు



దీపావళి పర్వదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాలు సుఖసంతోషాలు, ప్రశాంతత, విజయాలతో వెలిగిపోవాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు సాధించిన (మిగతా 2వ పేజీలో..)

## 'E20 కాస్తా 420గా మారింది'.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

- పెట్రోల్‌లో పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారని ఆయిల్ కంపెనీలపై రాహుల్ ఆరోపణ
- కర్ణాటక ప్రభుత్వ ల్యాబ్ టెస్టుల్లో 31శాతం వరకు ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని వ్యాఖ్య
- తమపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండించిన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు
- ఈ వివాదంతో వాహనాల మైలేజీ, ఇంజిన్ల భద్రతపై వినియోగదారుల్లో పెరిగిన ఆందోళన

దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ20 కాస్తా 420గా మారింది -- ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు.కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 (మిగతా 2వ పేజీలో..)



## డిండికి ఏదుల నుంచి నీళ్లు తేవడం అసాధ్యం: కవిత

నల్లగొండ: ఏదుల నుంచి డిండి రిజర్వాయర్‌కు నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి జలాలను నల్లగొండ ప్రాంతానికి తీసుకొస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం డిండి రిజర్వాయర్‌ను సందర్శించిన ఆమె, నీటి ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనలో సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనుల కారణంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం దెబ్బతిన్నదని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకే నీటిని అందించడానికి ఎక్కువ సమయం పడుతుందని, ఈ పరిస్థితుల్లో నల్లగొండకు నీటిని తీసుకురావడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు.

బస్వాపూర్ నుంచి నీటిని అందించవచ్చు..

బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఉల్పర, శివన్నగూడెం ప్రాంతాలకు నేరుగా గోదావరి జలాలను అందించే అవకాశం ఉందని కవిత వివరించారు. తమ ప్రతిపాదనలోని ప్రయోజనాలను నల్లగొండ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఇంజినీర్లతో (మిగతా 2వ పేజీలో..)



## విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!

- విద్యార్థుల ఉచిత ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు మంజూరు
- పథకానికి 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్'గా పేరు
- డిగ్రీ, డిప్లొమా మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు అవకాశం
- పలు ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకూ వర్తింపు
- ల్యాప్‌టాప్‌లలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ ఉండేలా నిర్ణయం



తమిళనాడు విద్యార్థులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుభవార్త చెప్పారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు రూ.2,000 కోట్లు మంజూరు చేశారు. 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది.ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరంలో (మిగతా 2వ పేజీలో..)

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

**అమరావతి, హైదరాబాద్, నవంబరు 7:**





దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఇరువురు ముఖ్యమంత్రులు ప్రకటనలు విడుదల చేశారు. ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

**ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి: చంద్రబాబు**

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని కోరుకున్నారు. మనం వెలిగించే దీపం మన ఇంటికే పరిమితం కాకుండా సమాజానికి కూడా వెలుగునివ్వాలని అభిలాషించారు.

**తెలంగాణ ప్రజలకు రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు..**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

# 02 జనరల్ న్యూస్

## సం పా ద కీ యం

### రక్తదానం.. ప్రాణదానానికి మించిన మహాదానం లేదు!

మనిషి ప్రాణాన్ని నిలబెట్టడంలో రక్తానికి ఉన్న ప్రాధాన్యం అపారం. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయ సమస్యలు, క్యాన్సర్ చికిత్సలు, ఇతర తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో రక్తం అవసరం ఏర్పడుతుంది. ఆధునిక వైద్యం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రక్తానికి కృత్రిమ ప్రత్యామ్నాయం అందుబాటులో లేదు. అవసరమైన సమయంలో సరైన రక్తం అందకపోతే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే స్వచ్ఛంద రక్తదానం సమాజంలో అత్యంత విలువైన సేవగా గుర్తింపు పొందింది.ఒకరు ఇచ్చిన రక్తం మరొకరి జీవితాన్ని నిలబెట్టగలదు. డబ్బు, ఆస్తి, ఇతర వస్తువులను దానం చేయడం కంటే ప్రాణాలను కాపాడే రక్తదానం ఎంతో ప్రత్యేకమైనది. అయితే రక్తదానంపై ఇప్పటికీ కొంతమందిలో అపోహలు, భయాలు కొనసాగుతున్నాయి. రక్తదానం చేస్తే బలహీనత వస్తుందని, ఆరోగ్యం దెబ్బతింటుందని భావించడం సరికాదు. అర్హత కలిగిన ఆరోగ్యవంతులు వైద్యుల సూచనల మేరకు రక్తదానం చేయవచ్చు.

అపోహలను వీడి ముందుకు రావాలి

రక్తదానంపై ప్రజల్లో సరైన అవగాహన పెరగాలి. రక్తదానం చేసిన వెంటనే శరీరంలో రక్త పరిమాణం తగ్గిపోతుందని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వస్తాయని కొందరు భయపడుతుంటారు. వాస్తవానికి నిర్దేశించిన వైద్య ప్రమాణాలను పాటిస్తూ, ఆరోగ్య పరీక్షల అనంతరం అర్హులైన వ్యక్తుల నుంచి మాత్రమే రక్తాన్ని సేకరిస్తారు. దానం చేసిన ద్రవ భాగాన్ని శరీరం త్వరగా భర్తీ చేసుకుంటుంది. రక్తంలోని కణాలు కూడా సహజ ప్రక్రియ ద్వారా తిరిగి ఉత్పత్తి అవుతాయి.అయితే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులు కారు. వయసు, బరువు, హీమోగ్లోబిన్ స్థాయి, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను వైద్య సిబ్బంది పరిశీలించాలి. తాత్కాలిక అనారోగ్యం లేదా కొన్ని వైద్య పరిస్థితులు ఉన్నప్పుడు రక్తదానాన్ని వాయిదా వేయాల్సి రావచ్చు. అందువల్ల నిపుణుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండాలి

రోడ్డు ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమస్యలు ఎప్పుడు ఎదురవుతాయో చెప్పలేం. అలాంటి సమయంలో రక్తం కోసం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి రాకుండా రక్తనిధులు తగిన నిల్వలను నిర్వహించాలి. ముఖ్యంగా అరుదైన రక్తగ్రూపులు అవసరమైనప్పుడు సరైన సమయంలో దాతలను గుర్తించడం సవాలుగా మారుతోంది.ప్రతి జిల్లాలో రక్తనిధుల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రక్తదాతల వివరాలను క్రమబద్ధంగా నిర్వహించాలి. అత్యవసర అవసరాల కోసం సంప్రదించగల స్వచ్ఛంద దాతల వ్యవస్థ ఉండాలి. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ అవసరమైనప్పుడు మళ్లీ ముందుకు రావడం, ఇతరులను ప్రోత్సహించడం ద్వారా ఈ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

యువతలో సేవాభావం పెరగాలి

యువతలో శక్తి, ఉత్సాహం, సామాజిక బాధ్యత ఎక్కువగా ఉంటాయి. ఈ శక్తిని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల వైపు మళ్లించాలి. విద్యార్థులు, ఉద్యోగులు, యువజన సంఘాలు స్వచ్ఛంద రక్తదాన శిబిరాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. అయితే రక్తదానాన్ని కేవలం ఒక కార్యక్రమంగా నిర్వహించి ముగించకుండా నిరంతర సేవగా కొనసాగించాలి.కళాశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు, అర్హతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. యువతలో సేవాభావం పెరిగితే అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఎదురుచూసే కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తుంది.

మహిళల భాగస్వామ్యానికి ప్రోత్సాహం

రక్తదాన కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం కూడా పెరగాలి. అయితే రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా రక్తదానం చేయకూడదు. మహిళల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, తగిన అర్హత ఉన్నవారిని మాత్రమే రక్తదానానికి అనుమతించాలి.మహిళల్లో పోషకాహారం, రక్తహీనత నివారణపై అవగాహన పెంచడం కూడా ముఖ్యమే. ఆరోగ్యవంతమైన మహిళలు స్వచ్ఛంద రక్తదానంలో పాల్గొనేలా ప్రోత్సహించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

రక్తదానం పేరుతో వ్యాపారాలకు అడ్డుకట్ట

రక్తం ప్రాణాలను కాపాడే విలువైన వైద్య వనరు. దాని సేకరణ, పరీక్షలు, నిల్వ, పంపిణీ అన్నీ నిర్దిష్ట వైద్య ప్రమాణాల ప్రకారం జరగాలి. రక్తం పేరుతో అక్రమ వసూళ్లు, నకిలీ రక్తనిధులు, నాణ్యత లేని సేకరణ పద్ధతులకు అవకాశం ఇవ్వకూడదు. ప్రభుత్వ, ప్రైవేటు రక్తనిధులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి.సేకరించిన రక్తాన్ని అవసరమైన రక్తపరీక్షలు, సంక్రమణ వ్యాధుల పరీక్షలు నిర్వహించిన తర్వాతే వినియోగించాలి. రక్తాన్ని సురక్షితంగా నిల్వ చేసి, అవసరమైన రోగులకు అందించే వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. స్వచ్ఛంద రక్తదాతల సేవలను గౌరవిస్తూనే రక్తనిధుల నిర్వహణలో వైద్య ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.

### దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి)

విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

**సైనికులతో దీపావళి వేడుకలు..**

గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాని మోదీ దీపావళి పండుగను సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికులతో కలిసి జరుపుకుంటున్నారు. దేశ రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలందిస్తున్న సైనికులతో పండుగను గడపడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించనున్నట్లు తన వీడియో సందేశంలో వెల్లడించారు.

### డిండికి ఏడుల నుంచి నీళ్లు తేవడం అసాధ్యం: కవిత

మొదటి పేజీ తరువాయి)

సాంకేతికంగా తనిఖీ చేయించుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదన అమలైతే ప్రాంతానికి ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఎస్ఎల్బీసీ పనులపై విమర్శలు..

ఎస్ఎల్బీసీ సొరంగం పనులు నత్తనడకన సాగుతున్నాయని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే సొరంగంలో కార్మికులు మృతి చెందారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా టన్నెల్ పనుల విషయంలో కొంత నిర్లక్ష్యం చేసిందని అంగీకరిస్తూ, అందుకు క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి..

పంటలు వేయవద్దని సూచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రత్యామ్నాయ సహాయం అందిస్తుందో స్పష్టం చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, బీఆర్ఎస్ నిద్రమత్తును వదిలించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు.ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

## విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!

మొదటి పేజీ తరువాయి)

మొదటి, రెండో ఏడాది డిగ్రీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించనున్నారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఆర్ట్స్, సైన్స్, వైద్య, న్యాయ, వ్యవసాయ, పశువైద్య, మత్స్యశాస్త్ర కోర్సుల విద్యార్థులు కూడా ఈ పథకానికి అర్హులు. గత విద్యా సంవత్సరంలో ల్యాప్‌టాప్‌లు అందుకోని ప్రొఫెషనల్ కోర్సుల మూడు, నాలుగో ఏడాది విద్యార్థులకూ అవకాశం కల్పించారు.ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి సామర్థ్యం ఉన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ లేదా దానికి సమానమైన సాంకేతికత ఉండనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ల్యాప్‌టాప్‌ల కొనుగోలు బాధ్యతను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు (జూజూ)కు అప్పగించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలను కొనుగోలు చేయనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఆన్‌లైన్ తరగతులు, సాంకేతిక నైపుణ్యాల అభ్యాసం, ఉద్యోగ అవకాశాలకు సిద్ధమయ్యేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## 'E20 కాస్తా 420గా మారింది'.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు. అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

**ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు**

అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి. ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఇరాన్‌తో యుద్ధమే లేదు.. ఇజ్రాయెల్‌ను నేనే కాపాడాను: ట్రంప్

మొదటి పేజీ తరువాయి)

"గత ఐదు నెలలుగా ఈ ఘర్షణలో ఎవరూ గాయపడలేదు, చనిపోలేదు. అలాంటప్పుడు దీన్ని యుద్ధం అని ఎలా అంటారు? ఇది యుద్ధం కాదు" అని ట్రంప్ స్పష్టం చేశారు.ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల భవిష్యత్ కార్యాచరణపై అనిశ్చితి కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికీ సైనిక ప్రత్యామ్నాయాలపై చర్చిస్తున్నప్పటికీ, ఇది యుద్ధం కాదని ఆయన నొక్కి చెప్పడం గమనార్హం.మరోవైపు, ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారకుండా తాను అడ్డుకోకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ సహా మొత్తం పశ్చిమాసియా ఉనికిలో ఉండేది కాదని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ అణు ఆశయాలను అడ్డుకోవడంలో తన పాత్ర అందరికీ తెలిసినా, ఎవరూ బహిరంగంగా అంగీకరించరని ఆయన పేర్కొన్నారు. "నేను ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా ఆపకపోతే ఇజ్రాయెల్, వాస్తవానికి మొత్తం పశ్చిమాసియా ఈరోజు ఉండేది కాదు. ఈ నిజాన్ని ఎవరూ చెప్పరు, కానీ అందరికీ తెలుసు!" అని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు.ఇరాన్ అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకుండా నిరోధించడమే లక్ష్యంగా 2025, 2026 సంవత్సరాల్లో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై భారీ దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమానికి ఎంత నష్టం వాటిల్లిందనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. అక్టోబర్‌లో వెలువడిన కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక ప్రకారం.. ఈ దాడులు ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఎంతవరకు ప్రభావితం చేశాయో చెప్పడం కష్టమని పేర్కొంది. అంతేకాకుండా గతంలో చేసిన అంచనాల ప్రకారం, ఇరాన్ అసలు అణ్వస్త్రాలను నిర్మించడం లేదని కూడా ఆ నివేదిక గుర్తు చేసింది. మరోవైపు, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని, అణ్వస్త్రాలను అభివృద్ధి చేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది.

## ప్రజాబలం యాత్రతో ప్రజల్లోకి వెళ్తా: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులు లాభాలు పొందుతున్నారని పేర్కొంటూ, గత ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు.

పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?

కరోనా సమయంలో క్రోసిన్ మాత్ర వేసుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని, ఆయన మాటలు విన్నవారు ప్రాణాలు కోల్పోయారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఆశతో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టులు పూర్తయి ఉంటే పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి, ఇందుకోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి సీబీఐ విచారణను అడ్డుకున్నారని ఆరోపించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రచారం చేసిన నేతలు ఇప్పుడు మేడిగడ్డ అంశం ప్రస్తావనకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా గోదావరి జలాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు.

కొడంగల్‌కు గతంలో ఏం చేశారు?

కేసీఆర్ హయాంలో కొడంగల్ నియోజకవర్గానికి ఏం చేశారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో సరైన బడులు, గుడులు, రహదారులు కూడా లేవని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే కొడంగల్‌కు వచ్చి తనను ఓడించాలని ప్రచారం చేశారని, అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. టస్సర్ కార్మికులకు రావాల్సిన అభివృద్ధి నిధులను సిరిసిల్లకు తరలించారని అన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే వారికి ఎందుకంత అసూయ అని ప్రశ్నించారు.కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే తనకు ముఖ్యమంత్రి పదవి దక్కిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ సమీపంలోని నోయిడా, ముంబై పక్కనున్న పుణె తరహాలో కొడంగల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి అనేక ప్రాజెక్టులు తీసుకొస్తామని, విద్యా సదుపాయాలను విస్తరిస్తామని తెలిపారు. గతంలో ఇంటర్మీడియట్ చదవాలన్నా విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా చదువుకునేందుకు కొడంగల్‌కు వచ్చేలా విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇక్కడ పండే కందులు, జొన్నలకు మరింత ప్రాధాన్యం రావాలంటే ప్రాంతం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని చెప్పారు.

రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు..

కొడంగల్‌ను ఇతర ప్రాంతాలు అసూయపడేలా దేశానికే ఆదర్శంగా నిలిపే విధంగా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ ప్రాంతంలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అందరికీ రేపు దీపావళి అయితే, కొడంగల్‌కు మాత్రం ఈ రోజే దీపావళి వెలుగులు వచ్చాయని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా తన స్థాయికి చేరుకోలేరని అన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదని, ఆ పార్టీని మళ్లీ నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు.

రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలి..

తమ ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్నధాన్య పంటలను సాగు చేసిన రైతులకు ప్రస్తుతం రూ.4 వేల చొప్పున చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వరి పంట వేస్తే నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని చెప్పారు. జూలై వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్న నేపథ్యంలో రైతులు నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై అసెంబ్లీలో చర్చించాలని తమ ప్రభుత్వమే ముందుగా భావించిందని, ఈ అంశంపై చర్చకు అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిపారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
నవంబర్ | ఆదివారం | 8 | 2026



# సేవే ధ్యేయం.. క్రమశిక్షణే మార్గం!





**స్కౌట్స్‌తో విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తి!**

**వరంగల్, నవంబర్ 07 (విజయ కెరటం):**

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావాన్ని అలవర్చుకోవాలని చార్ బౌలి హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సిరివెళ్ల హరిప్రసాద్ అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల్లో సేవానిరతి, సామాజిక బాధ్యతను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వరంగల్ కాశిబుగ్గలోని చార్ బౌలి హైస్కూల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ బాదావత్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.అనంతరం స్కౌట్ మాస్టర్ బాదావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. సేవాభావంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం, సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడం ప్రతి స్కౌట్, గైడ్ బాధ్యతగా భావించాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభకు కేవలం మార్కులు, ర్యాంకులే కొలమానం కాదని, ఇతరులకు సహాయపడే గుణం, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించే తీరే నిజమైన వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని, ప్రతి ఒక్కరూ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అపర్ణ, ప్రసన్నలక్ష్మి, రమేష్, మహేంద్రనాథ్, జి.వీణ, జ్యోతిరాణి, మాధురితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# దీపావళిని ఆనందంగా.. సురక్షితంగా జరుపుకోవాలి

- **బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి -- 108 సేవల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బి. సుధాకర్**

**నల్గొండ (విజయ కెరటం):**

అక్టోబర్ 7 దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా జరుపుకోవాలని EMRI GHS--తెలంగాణ 108 అత్యవసర సేవల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బి. సుధాకర్ సూచించారు. పండుగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం కూడా అగ్నిప్రమాదాలు, కాలిన గాయాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.2025 సంవత్సరానికి సంబంధించిన గణాంకాల ప్రకారం సాధారణ రోజుల్లో అగ్నిప్రమాదాల కారణంగా 1,766 మంది గాయపడగా, ఒక్క దీపావళి రోజునే బాణసంచా ప్రమాదాల వల్ల 1,699 మంది ప్రమాదాలకు గురైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచుతూ 108 అత్యవసర సేవలు 24 గంటల పాటు పనిచేస్తున్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు, కాలిన గాయాలు, కంటికి గాయాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే 108కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు:

ఇళ్లలో కాకుండా విశాలమైన బహిరంగ ప్రదేశాల్లోనే టపాసులు కాల్చాలి.

ఇళ్లు, వాహనాలు, మండే వస్తువులకు దూరంగా ఉండాలి.

కాటన్ దుస్తులు, పాదరక్షలు ధరించాలి. వదులుగా ఉండే సింథటిక్ దుస్తులను నివారించాలి.

చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలి.

చేతిలో పట్టుకుని టపాసులు కాల్చకూడదు. నేలపై ఉంచి తగిన దూరం పాటించాలి.

సమీపంలో నీరు లేదా ఇసుక బకెట్ అందుబాటులో ఉంచుకోవాలి.

పేలని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదు.

అధిక శబ్దం వచ్చే బాణసంచాకు దూరంగా ఉండాలి.

కాలిన గాయాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలు:

వెంటనే 108కు ఫోన్ చేసి వైద్య సహాయం పొందాలి.

కాలిన ప్రాంతాన్ని సాధారణ చల్లటి ప్రవహించే నీటితో 20 నిమిషాల పాటు చల్లబరచాలి. ఐస్ ఉపయోగించకూడదు.



గాయాన్ని శుభ్రమైన మెత్తటి వస్త్రంతో లేదా స్టెరైల్ డ్రెస్సింగ్‌తో వదులుగా కప్పాలి.

కొబ్బరి నూనె, టూత్‌పేస్ట్, ఇంకు వంటి పదార్థాలను పూయకూడదు.

ఏర్పడిన బొబ్బలను పగలగొట్టకూడదు. చర్మానికి అంటుకున్న దుస్తులను బలవంతంగా తొలగించకూడదు.

వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలి.

ప్రజల చిన్నపాటి జాగ్రత్తలు ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడగలవని బి. సుధాకర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని కోరారు. EMRI GHS--108 అత్యవసర సేవల తరపున రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలి





- **విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం: కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, నవంబర్ 7 (విజయ కెరటం):**

నేటి విద్యార్థులు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని అలవర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.శనివారం నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో కలెక్టర్ ఎలెవన్, ఎస్పీ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. 12 ఓవర్ల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఎస్పీ జట్టు 118 పరుగులు సాధించి విజయం సాధించగా, కలెక్టర్ జట్టు 107 పరుగులతో రన్నరప్‌గా నిలిచింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధుల్లో నిత్యం బిజీగా ఉండే అధికారులు ఇలాంటి క్రీడా పోటీల ద్వారా తమలోని క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చన్నారు. ముఖ్యంగా 10 నుంచి 18 ఏళ్ల వయస్సు పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటు పడి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, తోటి వారితో కలిసిమెలిసి ఉండే అలవాటు తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించి సమాజానికి మంచి సందేశం అందించాలనే ఉద్దేశంతో ఈ మ్యాచ్ నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు.మ్యాచ్‌లో బెస్ట్ బౌలర్‌గా ఇరుగు రవి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శ్రీరామ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హరిబాబు ట్రోఫీలు అందుకున్నారు. విజయం సాధించిన ఎస్పీ జట్టును కలెక్టర్ అభినందించారు.అనంతరం కలెక్టర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, స్థానిక కార్పొరేటర్ సుభాష్ కలిసి ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులు రూ.1.80 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పద్మ, బాబుగౌడ్, చీఫ్ మేనేజర్ శ్రీరాములు, కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్. సౌమిత, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, కామెంటేటర్ గిరిబాబు, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా డ్యూటీకి దక్కని వేతనం!

**పనులు చేయించుకుని జీతాలివ్వరా?**

**వరంగల్, నవంబర్ 07 (విజయ కెరటం):**



నెల రోజుల పాటు అదనపు విధులు నిర్వహించాం.. దసరా పండుగను సైతం పక్కనపెట్టి పనిచేశాం.. అదనపు వేతనాలు చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు జీతాలు ఇవ్వకపోవడం ఏమిటని ఎంజీఎం ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు, భద్రతా సిబ్బంది, రోగుల సంరక్షణ సిబ్బంది ప్రశ్నించారు. తమ శ్రమను వినియోగించుకుని వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.వరంగల్ మహానగరంలోని కొత్తగా నిర్మించిన తెలంగాణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి టిమ్స్ లో నెల రోజుల పాటు అదనపు విధులు నిర్వహించినప్పటికీ వేతనాలు అందకపోవడంతో శనివారం కార్మికులు విధులను బహిష్కరించారు. శ్రీకృష్ణ కాంట్రాక్టు సంస్థ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పండుగ రోజుల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి విధులు నిర్వహించిన తమకు అదనపు వేతనాలు చెల్లించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.నెల రోజుల పాటు కార్మికులతో అదనపు పనులు చేయించుకున్న కాంట్రాక్టు సంస్థ వేతనాలు చెల్లించకపోవడానికి కారణమేంటని కార్మికులు నిలదీశారు. కార్మికుల సమస్యలను పర్యవేక్షించాల్సిన ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.కాంట్రాక్టు సంస్థ పనితీరును పర్యవేక్షించాల్సిన జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు. కార్మికులతో పనులు చేయించుకోవడమే తప్ప వారి వేతనాల చెల్లింపుపై బాధ్యత వహించరా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టు సంస్థ ద్వారా పెండింగ్ వేతనాలు, అదనపు విధుల బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## మునుగోడు అభివృద్ధికి నిధులు కేటాయించాలి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి





**మునుగోడు: విజయ కెరటం నవంబర్ 7**

మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, తగిన నిధులు కేటాయించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరారు. మునుగోడులోని పీఆర్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు, మునుగోడు ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు సుంకరి బిక్షం గౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, బిక్షం గౌడ్‌ను ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, దీక్షకు బిక్షం గౌడ్ మారుపేరని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేస్తూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచారని ప్రశంసించారు. ఇలాంటి నిబద్ధత కలిగిన వ్యక్తులకు ఉద్యోగ విరమణ అనేది ఉండదని, ఇకపై కూడా సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.సమాజంలో అవినీతి పెరిగిపోతోందని, నాయకులు నీతిగా ఉంటేనే ప్రజలకు న్యాయమైన పాలన అందుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలు, బడుగు బలహీన వర్గాల పార్టీ అని పేర్కొంటూ, బీసీలకు ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతోనే బీసీ బిడ్డ అయిన సుంకరి బిక్షం గౌడ్‌కు పీఆర్టీయూ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని తాను ప్రయత్నించినట్లు తెలిపారు. కొడంగల్‌లో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడాన్ని తప్పుబట్టడం లేదని, అయితే మునుగోడు ప్రజలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ప్రపంచంలోనే ఫ్లోరైడ్ సమస్యతో తీవ్రంగా బాధపడిన నియోజకవర్గాల్లో మునుగోడు ఒకటని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న తపన తనకు ఉందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అన్ని నియోజకవర్గాలను సమానంగా చూడాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పలుమార్లు కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మునుగోడుతో పాటు ఇతర వెనుకబడిన నియోజకవర్గాలను గుర్తించి, వాటి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్ డే ఘనంగా నిర్వహణ



**నల్గొండ నవంబర్ 7 విజయ కెరటం:**



జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 76వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధ్యక్షుడు బి. చంద్రశేఖర్ ఐఏఎస్‌కు జిల్లా కార్యదర్శి ఇ. కరుణాకర్ స్కార్ఫ్ ధరింపజేశారు. అనంతరం స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, సేవాభావం పెంపొందించుకోవడానికి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరాలని సూచించారు. విద్యార్థులను బాధ్యతగల భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఈ సంస్థ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇ. కరుణాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు సురేష్ గుప్తా, ఆర్. విమల, గైడ్ కెప్టెన్ సుజాత, స్కౌట్ మాస్టర్ శీను నాయక్, సెయింట్ అల్ఫోన్సెస్ హైస్కూల్ స్కౌట్ విద్యార్థులు, కట్టంగూర్ కేజీబీవీ గైడ్స్ విద్యార్థినులు పాల్గొన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

## వంగాల నరసింహారెడ్డి దశదినకర్మకు హాజరై నివాళులర్పించిన మేయర్

**నార్కట్‌పల్లి, నవంబర్ 7 (విజయ కెరటం):**



కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల అనిల్ రెడ్డి తండ్రి వంగాల నరసింహారెడ్డి ఇటీవల మృతి చెందగా, శనివారం నార్కట్‌పల్లి మండలం బాజకుంట గ్రామంలోని ఆయన స్వగృహంలో దశదినకర్మ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కోమటిరెడ్డి పృథ్వీధర్ రెడ్డి, ఏదుళ్ల మధుసూదన్ రెడ్డి, రేగట్ట లింగస్వామి గౌడ్, మారం గోనారెడ్డి, కృష్ణారెడ్డి, దోనాల నాగార్జున రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. వంగాల నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## దీపావళి వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో నిండాలి

### రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 7 (విజయ కెరటం):**



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని కోరుకున్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.దీపావళి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## మంత్రి కోమటిరెడ్డిని నిశ్చితార్థానికి ఆహ్వానించిన సినీ నటుడు తేజ సజ్జా

**హైదరాబాద్, నవంబర్ 07 (విజయ కెరటం):**



సినీ నటుడు తేజ సజ్జా తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నిశ్చితార్థ వేడుకకు హాజరుకావాలని కోరుతూ మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని తన వేడుకకు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం -- నల్లగొండ జిల్లా

- **మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సయ్యద్‌కు ఘన సన్మానం- మాజీ కోఆప్షన్ షేక్ అబ్దుల్ రహీం**

**తిప్పర్తి నవంబర్ 7 విజయకేరటం ప్రతినిధి:**



నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన షేక్ సయ్యద్ ని ఈరోజు తిప్పర్తి మండలం కాశివారిగూడెంలో లితెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ.. తురక కాశ జాతి అభివృద్ధి, సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని, సంఘం ఆశయాలు నెరవేరే వరకు ప్రభుత్వంతో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.తురక కాశ లకు మరిన్ని నామినేటెడ్ పదవులు కల్పించాలని, ప్రత్యేక తురక కాశ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మౌలానా ఖయ్యూం సాహెబ్, హఫీజ్ ఖాసిం సాహెబ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ నూర్ మహమ్మద్, సంఘం నాయకులు షేక్ లతీఫ్ పాషా, షేక్ అలీ, షేక్ కలీం, షేక్ మౌలానా, షేక్ మహమూద్, షేక్ ఉస్మాన్, షేక్ అల్లావలి, షేక్ రంజాన్, షేక్ హుస్సేన్, షేక్ ఇమామ్. షేక్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఆర్థిక భరోసా

- **60 మంది లబ్ధిదారులకు రూ.33.55 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**

**నల్లగొండ, నవంబర్ 7 (విజయ కెరటం):**



వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 60 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.33,55,500 విలువైన చెక్కులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం నల్లగొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. ఆపద సమయంలో నిరుపేదలకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

# కార్తీకోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి









**హైదరాబాద్, నవంబర్ 7 (విజయ కెరటం):**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు కొండపైన ఆలయ ఉత్తర మాడ వీధిలో నిర్వహించనున్న కార్తీకోత్సవాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు.ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదాద్రి దేవస్థానం ఈవో భవానీ శంకర్ తదితరులు మంత్రిని కలిసి ఉత్సవాలకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి కార్తీకోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# కార్మిక--కర్షక ఐక్యతతో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి






- **ఈ నెల 15న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలి: సీఐటీయూ నాయకులు**

**నల్గొండ, నవంబర్ 7 (విజయ కెరటం):**

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక--కర్షక ఐక్యతను బలోపేతం చేస్తూ ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం, జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ పిలుపునిచ్చారు. ఈ నెల 15న నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.శనివారం ఎఫ్‌సీఐ, బెవరేజెస్, ఎలక్ట్రిసిటీ స్టోర్, హమాలీ వర్కర్స్ యూనియన్ల జనరల్ బాడీ సమావేశాలు ఆయా కార్యాలయాల వద్ద వేర్వేరుగా నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విదేశీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేయడం వల్ల దేశీయ రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతుల రక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాలకు కార్మిక వర్గం మద్దతుగా నిలవాలని కోరారు.నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించే ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 14 నుంచి 16 వరకు పెద్ద గడియారం సెంటర్‌లో వ్యవసాయ ప్రదర్శన, ఫెస్ట్, కళాకారుల ఆటపాటల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు, వాతావరణ ప్రభావం, పంటల పరిస్థితులు, ఆధునిక వంగడాలపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను వేలాదిగా తరలివచ్చి తిలకించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశాల్లో ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల యాదయ్య, ఎఫ్‌సీఐ హమాలీ యూనియన్ అధ్యక్షుడు సుంకరబోయిన వెంకన్న, బెవరేజెస్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు సల్ల యాదయ్య, నాయకులు జేరిపోతుల సైదులు, పజ్జూరి యాదగిరి, వెంకన్న, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా దీపావళి వెలుగులు నిండాలి

### రాష్ట్ర ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు

**నల్లగొండ, నవంబర్ 07 (విజయ కెరటం):**



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రతి ఇంట్లో చీకట్లను పారద్రోలి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, విజయాలు వెల్లివిరియాలని, లక్ష్మీదేవి కటాక్షంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు పెద్దల సమక్షంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా, పర్యావరణ హితమైన గ్రీన్ క్రాకర్స్‌తో దీపావళి వేడుకలను జరుపుకోవాలని మంత్రి సూచించారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528